క్లుప్తంగా

సాగునీరు అందించాలి

నేలకొండపల్లి: ప్రస్తుత యాసంగిలో రైతులు సాగు చేసే పంటలకు ఆరుతడికి సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేశ్ కోరారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుతడి పంటలకు సాగునీరు ఇవ్వకపోతే ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున సాగునీరు అందిచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో రచ్చా నరసింహారావు, గుడవర్తి నాగేశ్వరరావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, దుగ్గి వెంకటేశ్వర్లు, కట్టికోల వెంకన్న, బెల్లం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థి విద్యా మంథన్'లో హార్వెస్ట్ ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న విద్యార్థి విద్యా మంథన్ పోటీ పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. మంగళవారం విద్యార్థులను అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. ఎన్సీఈఆర్టీ 6 నుంచి పదో తరగతి విద్యార్థులు పరీక్షలో పాల్గొనగా.. రాష్ట్రస్థాయి పోటీలకు శ్రేష్ఠ, జూహితాచౌదరి, శ్రావణి, ఈషాసింగ్, జోష్ షద్రక్, దీత్యా, సాయి సంథామిని, క్రిష్ణ మనోజ్ఞ, కృష్ణ మాథూర్‌లు ఎంపికయ్యారని వీరు ఈ నెల 24వ తేదీన పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ బ్రాంచ్ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అజయ్‌కుమార్, తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: ప్రపంచ తెలుగు మహాసభల పోస్టర్లను మంగళవారం ఖమ్మం నగరంలోని జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కె.అజయ్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో వచ్చే ఏడాది జనవరి 5, 6, 7 తేదీల్లో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యాన ప్రపంచ తెలుగు మహాసభలు జరగనున్నాయి. ఈమేరకు సాంస్కృతిక కార్యక్రమాలు, సదస్సులు జరగనున్నట్లు సభల తెలంగాణ ప్రచార కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు మలిశెట్టి కృష్ణమూర్తి, రెంటాల చిన్న హుస్సేన్, తిరునగరి శ్రీనివాస్, గుమ్మడి పుల్లయ్య, రేళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బుక్‌లెట్లు..

ఖమ్మం మామిళ్లగూడెం: సైబర్ నేరాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మం సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన శ్యాం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అవగాహనకు సంబంధించిన బుక్‌లెట్లను ఆవిష్కరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శి సాదినేని జనార్దన్‌రావు, సభ్యులు రిటైర్డ్ డీఎస్పీ నరసయ్య, శ్రీహరి, సూర్యప్రకాశరావు, అనాశి రాధాకృష్ణ, జెల్లన్న, గజేంద్రుల నాగేశ్వరావు, టీజనార్దన్‌రావు, హన్మంతరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

నేలకొండపల్లి: మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని (15) గత నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు, బంధువులు ఆమె స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ దొరకలేదు. ఈ నేపథ్యాన మంగళవారం కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అమాయకత్వానికి రూ.24 వేలు ఖతం..

నేలకొండపల్లి: అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఓ సైబర్ నేరగాడు సైబర్ నేరానికి పాల్పడ్డాడు. పొరపాటున తన డబ్బులు మీ ఖాతాలో పడ్డాయని వేధించి మరీ వసూలు చేశాడు. బాధితుడు కథనం ప్రకారం.. మండలంలోని అమ్మగూడెంకు చెందిన వి.గురవయ్యకు తనది శ్రీశైలం గ్రామమని, తానో పెద్ద ఉద్యోగిని అంటూ ఫోన్ చేశాడు. పొరపాటును తన ఖాతా నుంచి మీ ఖాతాలోకి రూ.24 వేలు జమ అయ్యాయని వెంటనే తనకు ఫోపే చేయాలని చెప్పాడు. దీంతో గురవయ్యకు ఎం చేయాలో అర్థం కాలేదు. కానీ మాటిమాటికి ఫోన్‌లు చేసి బెదిరింపులకు పాల్పడగా.. చివరకు మంగళవారం రూ.24 వేల నగదును ఫోన్‌పే ద్వారా సైబర్ నేరగాడికి బదిలీ చేశాడు. ఈ విషయాన్ని గ్రామస్తులకు చెప్పగా.. వారి సూచనల మేరకు బ్యాంక్‌కు వెళ్లి చూడగా ఎలాంటి డబ్బులు జమ కాలేదని తెలుసుకుని, తాను మోసపోయానని భావించి స్థానిక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

ఎస్ఎంసీ ఎన్నికలు ఎప్పుడో..?



సదాశివపురం ప్రభుత్వ పాఠశాల

నాలుగేళ్లుగా కొనసాగుతున్న వాయిదాల పర్వం

- ఈ నెలాఖరు వరకు పదవీ కాలం పొడిగింపు
- ఫలితంగా సక్రమంగా సాగని పాలన
- ఈసారైనా ఎన్నిక తథ్యమని ఉపాధ్యాయ వర్గాల భావన

నేలకొండపల్లి: పాఠశాల విద్యా కమిటీల పదవీ కాలాన్ని ఈ నెలాఖరు వరకు పొడగిస్తూ పాఠశాల విద్యా శాఖ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆరు నెలలు పాటు పొడిగించిన ప్రభుత్వం ప్రస్తుతం మరో నెల పాటు పొడిగించింది. గత నాలుగేళ్లుగా పాఠశాలకు కమిటీలు ఎన్నికలు నిర్వహించకపోవడంతో పాలన గాడి తప్పిందని విద్యావంతులు పేర్కొంటుండగా.. ఈసారైనా నూతన కమిటీల ఎన్నిక కచ్చితంగా జరుగుతాయని ఉపాధ్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నారు.

లక్ష్యాలు సాధించేందుకు..

విద్యాభిమానులు, తల్లిదండ్రులు సహకారంతో విద్యాశాఖ నిర్దేశించిన లక్ష్యాలను ఉపాధ్యాయులు సులభంగా సాధించేందుకు పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)లను ఏర్పాటు చేశారు. ఇవి పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు సరైన విద్య, బోధన, నాణ్యమైన భోజనం అందించేందుకు వారధిగా పని చేయడానికి దోహదపడుతాయి. ప్రస్తుతం ఉన్న కమిటీల పదవీకాలం నవంబర్ 30వ తేదీతో ముగియగా.. వాటిని డిసెంబర్ 31 వరకు కొనసాగించాలని నిర్ణయించింది.

సక్రమంగా సాగని పర్యవేక్షణ..

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిర్వహణతో పాటు ప్రతీ సంక్షేమపథంలో ఎస్ఎంసీ కమిటీలను ప్రభుత్వం భాధ్యులను చేసింది. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందా లేదా అని పర్యవేక్షించాల్సి ఉండగా.. గత నాలుగేళ్లుగా పాత కమిటీలనే కొనసాగిస్తుండడంతో పర్యవేక్షణలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇదిలా ఉండగా చాలా చోట్ల విద్యావంతులు కాకపోవడంతో సరిగా పర్యవేక్షించలేకపోతున్నారు. నూతనోత్సాహం కరువై తనిఖీలు లేకపోవడంతో తరచూ మధ్యాహ్నం భోజనంపై పలు విమర్శలు వస్తున్నాయి. అదే విధంగా మన ఊరు– మన బడి కార్యక్రమం కింద మంజూరైన పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. ప్రతి నెలా సమావేశం నిర్వహించి పాఠశాల అభివృద్ధికి, ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి, బడి బయట ఉండే పిల్లలను పాఠశాలలో చేర్పించడం, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సక్రమంగా వినియోగించేలా పర్యవేక్షించాల్సి ఉండగా అవేమి లేకపోవడంతో పాలన గాడితప్పినట్లయింది.

నెలాఖరు వరకు గడువు..



పాఠశాల విద్యా కమిటీల పదవీ కాలాన్ని ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పెంచినట్లు ఉత్తర్వులు అందాయి. కొత్త ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల మేరకు నూతన కమిటీలు ముందుకు సాగుతాయి. ప్రస్తుత కమిటీలు సక్రమంగానే పని చేస్తున్నాయి.

– బి.రాములు, మండల విద్యాశాఖాధికారి, నేలకొండపల్లి

విద్యావంతులను నియమించాలి..



ప్రభుత్వం లక్ష్యం నెరవేర్చేందుకు విద్యా కమిటీలో విద్యావంతులను నియమించాలి. పలితంగా పాఠశాల అభివృద్ధితో పాటు నిధులు దుర్వినియోగం కాకుండా దృష్టి సారిస్తారు. ఈమేరకు కొత్త ప్రభుత్వం కొత్త నిబంధనలు విధిస్తే పనులు సక్రమంగా జరుగుతాయి.

– పసుమర్తి శ్రీనివాస్, విద్యార్థి తండ్రి, నేలకొండపల్లి

విద్యా వ్యవస్థకు ప్రాధాన్యత..



గత ప్రభుత్వం వలన విద్యా వ్యవస్థ గాడి తప్పినప్పటికీ కొత్త ప్రభుత్వం విద్యా వ్యవస్థకు అధిక ప్రాధాన్యత కల్పించే విధంగా చర్యలు ఉంటాయని ఆకాంక్షించారు. వెంటనే పాఠశాలలకు ఎస్ఎంసీ కమిటీలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సి న అవసరం ఉంది.

– చిలకబత్తిని వీరబాబు, మాజీ సర్పంచ్, అనాసాగారం

ఆస్తి పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్నులు వసూలు చేయాలని, అవసరమైతే రెడ్ నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ రెవెన్యూ విభాగ అధికారులకు మంగళశారం కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం 'సాక్షి'లో 'ఆదాయం అంటే అలుసా..'అనే శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించిన ఆయన కేఎంసీ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆస్తి పన్నులు వసూలు చేయడంతో పాటు రివిజన్ పిటీషన్లను రెండు రోజుల్లో పరిష్కరించాలన్నారు. పన్ను కలెక్షన్ చేసే మిషన్లను సిద్ధం చేసుకోవాలని, మరమ్మతులు ఉంటే రెండు రోజుల్లో చేయించాలని ఆదేశించారు. ప్రతీ బిల్ కలెక్టర్ రోజుకు 20 అసెస్‌మెంట్లకు సంబంధించిన ఆస్తి పన్నులను వసూలు చేయడంతో పాటు నల్లా కనెక్షన్ బకాయిలు సేకరించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల చేయూత



ఎల్ఓసీని అందిస్తున్న దృశ్యం

ఖమ్మంవన్‌టౌన్: నగరానికి చెందిన ఓ నిరుపేద కుటుంబం ఆరోగ్యం బాగాలేక చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. సాయం కోసం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలవగా ఆయన వెంటనే స్పందించి రూ.2.5లక్షలను ఎల్ఓసీ ద్వారా మంజూరు చేయించి మానవత్వం చాటుకున్నారు. మంగళవారం ఎల్ఓసీ కాపీని కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, సాధు రమేష్‌రెడ్డిలు వారికి అందించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

ఖమ్మంరూరల్: తెలంగాణలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి సారించి గతంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి. రమేశ్ తెలిపారు. మంగళవారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయరాదని, ఏడాదిలో 200 రోజులు పనులు కల్పించాలని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో దళారీలు లేకుండా పారదర్శకంగా ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు నంద్ర ప్రసాద్, వి.సుదర్శన్‌రెడ్డి, పి.సుమతి, వెంకటేశ్వర్లు, పి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న వ్యాపార ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: లారీ ప్రమాదంలో మరణించిన ఎం.ఉపేందర్ కుటుంబానికి మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ అనుబంధ కూరగాయల రిటైల్ మార్కెట్ కమిటీ రూ.50 వేల ఆర్థిక సాయం అందజేసింది. కూరగాయల రిటైల్ మార్కెట్‌లో రిక్షా కార్మికుడిగా పనిచేస్తున్న ఉపేందర్ ఇటీవల నగరంలోని కరుణగిరి వద్ద జరిగిన లారీ ప్రమాదంలో మరణించాడు. ఈనేపథ్యాన ఆతడి భార్య, కుమారులకు రిటైల్ కూరగాయల మార్కెట్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ ఫజల్ రూ.10 వేలు, యూనియన్ తరఫున రూ.24 వేలు, రిక్షా కార్మికుల తరఫున రూ.16 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నాగేశ్వరరావు, జీవీఆర్ బోయినపల్లి కొండల్‌రావు, శెట్టి నాగేశ్వరరావు, ముంతా వెంకటేశ్వరరావు, నాగ, జానీమియా, ఆనందరావు, కేతసబోయిన నాగేశ్వరరావు, వీరభద్రం, నాగమణి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదవులు, కురుమలు రాజకీయంగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లిబాబుయాదవ్

కామేపల్లి: యాదవులు, కురుమలంతా సంఘటితమై రాజకీయంగా ఎదగాలని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ పేర్కొన్నారు. కల్లూరు మండలం ముచ్చవరం గ్రామానికి చెందిన యాదవులు మంగళవారం పండితాపురం గ్రామంలో ఆయన నివాసంలో కలిసి పలు సమస్యలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో యాదవులు, కురుమలు మేజర్‌గా ఉన్న గ్రామాల్లో పోటీ చేయాలన్నారు. గొర్రెల కోసం డీడీలు తీసిన వారందరికీ కాంగ్రెస్ పార్టీ న్యాయం చేస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యాదవులకు గొర్రెలు, బర్రెలు కాకుండా బాధ్యతగా తమ పిల్లలకు ఉన్నతమైన భవిష్యత్ కోసం ఉన్నత విద్య అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామరాంబాబు, తేలు నాగరాజు, రామకృష్ణ, శీలం జమలయ్య, తిరుపతిరావు, వర్దపోయిన పుల్లారావు, ఎనుముల వెంకయ్య, గోసు నాగయ్య, దర్గయ్య, కృష్ణ, రాచబంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఫీజుకు రూ.15 వేలు..

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్‌లో గల ఓ ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పేద విద్యార్థిని హర్ష పాఠశాల ఫీజుకు రచ్చబండ గ్రూప్ ఫ్రెండ్స్(వ్యాపారులు) ఆధ్వర్యాన మంగళవారం రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట్ల గోపాల్‌రావు, బూర్లె లక్ష్మీనారాయణ, బుర్రి చంద్రయ్య, కమటం అప్పారావు, బైరబోయిన శ్రీనివాసరావు, అర్తి గోవిందరావు, పసుమర్తి శ్రీనివాసరావు, నాగుబండి భాస్కర్ రావు, శ్రీరంగం శ్రీనివాసరావు, మార్తి రమేశ్, పోట్ల రామనాథం, రాంబాబు, శ్రీనివాసరావు, ఉపేందర్‌రావు, రవికుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలి



నిరసన తెలుపుతున్న స్థానికులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో 33వ డివిజన్ గాంధీనగర్ ప్రాంతంలో ఆకతాయిల అల్లర్లు ఎక్కువయ్యాయని, ఇక్కడ ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని స్థానికులు కోరారు. మున్సిపల్ సాధారణ నిధులతో మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా పాలరాతితో తయారు చేసిన గాంధీ విగ్రహం పునరావిష్కరణలో భాగంగా ఏర్పాటు చేసి ప్రారంభించిన శిలాఫలకాన్ని కొంతమంది గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారని, గాంధీ విగ్రహం ముందు గాంధీయవాదులు, ప్రజాస్వామ్యవాదులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గాంధీనగర్‌లో ఈ మధ్యకాలంలో కొంతమంది వ్యక్తులు శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. కాగా, ఈ విషయంపై స్థానిక ప్రజలు కార్పొరేటర్ తోట ఉమారాణి వీరభద్రం ఆధ్వర్యాన మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డివిజన్ పెద్దలు, ప్రముఖ వ్యాపారవేత్త గీత వెంకన్న, డివిజన్ అధ్యక్షుడు కమలాకర్, ఉపాధ్యక్షుడు ముత్తబోయిన లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానాల్లోనే మెరుగైన వైద్యం



పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సైదులు

కామేపల్లి: ప్రభుత్వ దవాఖానాల్లోనే మెరుగైన వైద్యం అందుతుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతున్న ఆరోగ్య మహిళా వైద్య శిబిరం కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నేపథ్యాన ఆరోగ్య మహిళల ద్వారా మహిళలకు అందుతున్న వైద్య పరీక్షలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలనే లక్ష్యంతో గర్భిణులకు ప్రభుత్వ దవాఖానాల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ కాన్పు ప్రభుత్వ దవాఖానాలోనే జరిగేలా వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చందన, హెచ్‌ఈఓ దూప్‌సింగ్, ఉమామహేశ్వరరావు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ఆటో డ్రైవర్లు..



పైనంపల్లి వద్ద రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం తమ పాలిట శాపంగా మారిందని ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం ఖమ్మం జిల్లా సరిహద్దు గ్రామమైన పైనంపల్లి బ్రిడ్జిపై రాస్తారోకో నిర్వహించారు. బ్రిడ్జిపై ఆటోలను అడ్డంగా నిలిపి కోదాడ–ఖమ్మం రహదారిపై నిరసన తెలిపారు. దీంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధి చాట్ల వాసు మాట్లాడుతూ.. ఉచిత ప్రయాణంతో మహిళలు బస్సులు ఎక్కడంతో తమకు గిరాకీ లేకుండా పోయిందని, కిరాయిలు కట్టలేక, ఆటో ఫైనాన్స్ వేధింపులు భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు కుటుంబ పోషణ కూడా భారంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావునా ప్రభుత్వం ఆటో వారికి కూడా ప్రత్యామ్నాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు ఉపేందర్, నరసింహారావు, తిరపయ్య, నాగులు, వెంకటేశ్, కృష్ణ, ఇస్మాయిల్, రామకృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఫొటో, వీడియోగ్రాఫర్ల ఆందోళన

ఖమ్మం సహకారనగర్: అసెంబ్లీ ఎన్నికలలో రాత్రనక, పగలనక కష్టపడి వీడియోగ్రఫీ చేసిన వీడియోగ్రాఫర్లందరికీ తక్షణమే బకాయిలు చెల్లించాలని ఖమ్మం జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేములూరి నాగరాజు దేవర డిమాండ్ చేశారు. మంగళవారం ఈమేరకు బకాయిలు చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు జరిగి ఇరవై రోజులు గడుస్తున్నా ఇంతవరకు బకాయిలు ఇవ్వలేదని, తక్షణమే బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కమటం రఘు, వీరన్నగౌడ్, బాలాజీనాయక్, రామారావు, స్వామి, రాము, కనకాచారి, శ్రీకాంత్, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి



బీఎల్ఓలకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్ జగన్నాథం

నేలకొండపల్లి: ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని తహసీల్దార్ అనురాధబాయి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో బూత్ లెవల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జనవరి 2024 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ నెల 20 నుంచి మార్పులు, చేర్పులకు అవకాశం ఉన్నందున వినియోగించుకోవాలని సూచించారు. శని, ఆదివారాలలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో బీఎల్ఓలు ఓటు నమోదుపై విస్తృతంగా ప్రచారం చేయాలని, ఓటు ఆవశ్యకతను తెలియజేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. బీఎల్ఓలకు ట్రైనర్ పెద్ది జగన్నాథం పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఆలస్యం మధుసూదన్‌రావు, సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణస్వామి వర్ధంతి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లా ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యాన మంగళవారం హైదరాబాద్ తొలి మేయర్ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 56వ వర్ధంతిని ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సదర్భంగా ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిట్టల వెంకటనర్సయ్య కృష్ణస్వామి ముదిరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. జిల్లా అధ్యక్షుడు రావుల హనుమంతరావు ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అంజయ్యముదిరాజ్, మల్సూర్, ప్రతానపు రామనాథం, మల్లేశ్, రాంబాబు, చింతల వెంకన్న, అనంత రాములు, వీర్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌నకు ఎంపిక



మాగి వెంకన్న

ఖమ్మం సహకారనగర్: తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన డాక్టర్ మాగి వెంకన్న ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌నకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ప్రొఫెసర్ కె.మాధవి పర్యవేక్షణలో తాను ఆర్టిజంతో బాధపడే పిల్లల విముక్తి కోసం అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. కాగా, వెంకన్న ఓయూలోని నిజాం కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వర్తిస్తుండగా, ఆయనను పలువురు అభినందించారు.

అటెన్షన్ ప్లీజ్

పందులతో పరేషాన్..!





ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే పందులు ఇదిగో ఇలా స్వైరవిహారం చేస్తున్నాయి. ఎన్నెస్పీ క్యాంపులోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకులం సమీప ప్రాంతాల్లో పదుల సంఖ్యలో పందులు సంచరిస్తున్నాయి. వసతి గృహాలకు ఆనుకొని ఉన్న మురుగు కాల్వల్లో స్వైరవిహారం చేయడంతో పాటు గోడల చుట్టూ తవ్వుతూ లోపలకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. అంతేకాక పలు ఇళ్లల్లోకి వెళ్తూ కాలనీవాసులు విష జ్వరాల బారిన పడేలా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా పందుల బెడద నుంచి తమకు విముక్తి కలిగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు వాపోతున్నారు.

– ఖమ్మంమయూరిసెంటర్